ఓటరు జాబితా సవరణలపై నాయకులతో సమావేశం

మెహిదీపట్నం, ఫిబ్రవరి 13 : ఓటరు జాబితా సవరణలపై జీహెచ్‌ఎంసీ సర్కిల్ 13 కార్యాలయంలో గురువారం డిప్యూటీ కమిషనర్ శశిరేఖ వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్వాన్ నియోజకవర్గంలోని డివిజన్లలో ఓటర్ వివరాల సేకరణ, సవరణతోపాటు, పోలింగ్ కేంద్రాలపై ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ,కృష్ణదాస్, జెన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో పీజీడీబీఎం, పీజీడీఎం, పీజీడీఈఎల్టీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

మూసీ ప్రాంతాల్లో గుర్రపు డెక్క తొలగింపు

జియాగూడ, ఫిబ్రవరి 13 : ప్రజలకు దోమల బెడద లేకుండా మూసీ నదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపడుతున్నామని జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బోయిని దర్శన్ తెలిపారు. గురువారం సీనియర్ ఎంటమాలజిస్ట్ రజని, ఏఈ రమేశ్, ఎంటమాలజీ సిబ్బందితో కలిసి పురాణాపూల్ వంతెన కింద మూసీ నదిలో చేపట్టిన గుర్రపుడెక్క తొలగింపు పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దర్శన్ మాట్లాడుతూ.. జియాగూడ డివిజన్ పరిధిలో కొంతకాలంగా దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో మూసీ పరీవాహక ప్రాంతాల్లో గుర్రపు డెక్క తొలగిస్తున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

బాగ్‌అంబర్‌పేటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఫిబ్రవరి 13 : నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెప్పారు. బాగ్‌అంబర్ పేట డివిజన్‌లోని ఏఎం-పీఎం పాన్‌షాపు గల్లీలో రూ.22 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలల క్రితం ఈ ప్రాంతంలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. పనులు పూర్తయిన తర్వాత రోడ్డు గుంతలుగా మారిందని, దాంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు, వరద నీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, టి.రమేశ్, రవీందర్, జె.బాలరాజు, శ్రీహరి, ఎం.శ్రీనివాస్, వెంకటరమణరాజు, శ్రీనివాస్ యాదవ్, సునీల్, శ్రీను, నరహరి, డీఈ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

రాందేవ్‌గూడలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 13 : రోడ్లపై ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ సర్కిల్ -13 టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం కూల్చివేశారు. లంగర్‌హౌస్ డివిజన్‌లోని రాందేవ్ గూడలో ప్రధాన రోడ్డును ఆక్రమించి కొందరు దుకాణాలను నిర్వహిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో గురువారం జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సర్కిల్ 13 సెక్షన్ ఆఫీసర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి. ఎస్‌ఐలు సమీ ఉజ్మా, ప్రేమ్‌రాజ్ బందోబస్తు నిర్వహించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో అపరిశుభ్రత పేరుకుపోతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

జవాబుపత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) అందించే ఎంబీఏ కోర్సు పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోల ర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మొద టి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ. 1,000 చొప్పున చెల్లించి ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ. 10,000 చొప్పు న చెల్లించి వచ్చే నెల 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యోగులు తిరిగి రావడం హర్షణీయం

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 13: రాష్ట్ర విభజన సమయంలో కమల్‌నాథన్ కమిటీ సూచనల మేరకు కొంతమంది తెలంగాణ ఉద్యోగులు ఆంధ్రకు కేటాయించారని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా అక్కడే పని చేస్తూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి విధులు నిర్వర్తించారని అన్నారు. ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, మంత్రిమండలి ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా ఉద్యోగులను తిరిగి తెలంగాణకు తీసుకురావడం హర్షణీయమని జగదీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి, మంత్రి మండలికి టీఎన్జీవో కేంద్ర సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి చొరవ చూపారని పేర్కొన్నారు. ఈ మేరకు రిపోర్ట్ చేసిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్స్ ఇవ్వడం అభినందనీయమని ఆయన అన్నారు.

ఘనంగా సరోజినీనాయుడు 146వ జయంతి

సుల్తాన్‌బజార్ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు

మెహిదీపట్నం ఫిబ్రవరి 13 : మెహిదీపట్నం సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో గురువారం సరోజినీ నాయుడు 146 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని, ఆర్ఎంఓ నజాఫి బేగం తదితరులు పాల్గొని సరోజినీనాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సరోజినీ నాయుడు చేసిన సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని కొనియాడారు..

సుల్తాన్‌బజార్ ప్రభుత్వ పాఠశాలలో..

సుల్తాన్ బజార్ : ప్రముఖ స్వాతంత్ర్య సమయోధురాలు, కవయిత్రి సరోజినీనాయుడు జయంతిని గురువారం సుల్తాన్ బజార్ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మాన్య కల్చరల్ అకాడమీ వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామ్ గోపాల్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాంపల్లిలో జన్మించిన సరోజినీనాయుడు తన 13వ ఏటనే రచయిత్రిగా మారిందని కొనియాడారు. కార్యక్రమంలో దినేశ్ పంచాల్, స్కేటింగ్ మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమికుల దినోత్సవాన్ని బహిష్కరించాలి

కాచిగూడ,ఫిబ్రవరి 13: దేశంలో ఫిబ్రవరి 14న నిర్వహించే ప్రేమికుల దినోత్సవాన్ని ప్రభుత్వాలు బహిష్కరించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు విజ్ఞప్తి చేశారు. గురువారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ప్రేమికుల దినోత్సవం విరుద్ధమన్నారు. శుక్రవారం నిర్వహించే ప్రేమికుల దినోత్సవానికి బదులుగా భారత సైనికుల వీర మరణ దినంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. నేటి యువత పాశ్చాత్య సంస్కృతి బారినపడకుండా మంచి మార్గంలో పయనించి దేశ ఔన్నత్యం, గౌరవాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శ్రీనివాస్ వాణి, మనోజ్, రామేశ్వర్‌మిశ్రా, పియూష్, అశిశ్, అశ్విని, పాల్గొన్నారు.

ప్రణీత్‌రావు బెయిల్‌పై ముగిసిన పీపీ వాదనలు

తీర్పును 14కు రిజర్వు చేసిన కోర్టు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్న రెండో ముద్దాయి దుగ్యాల ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు బెయిల్‌పై ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి గురువారం వాదనలు పూర్తి చేశారు. బెయిల్ మంజూరు చేయరాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఉన్న సాక్షుల, సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రమాదముందన్నారు. చార్జీషీట్ దాఖలు చేసిన సమయంలో స్టాటూటరీ (తప్పనిసరి) బెయిల్‌ను మంజూరు చేయాలని దాఖలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. తప్పులను సవరించేందుకు కోర్టు అవకాశం కల్పించిందని, అంతమాత్రాన చార్జీషీట్ వాపసు చేసినట్లు కాదని స్పష్టం చేశారు. 90రోజుల్లోపే చార్జీషీట్ దాఖలు చేయడం జరిగిందని, తర్వాత విచారణ కొనసాగిస్తున్నామని వివరించారు. అందుకు బదులుగా షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయాలని, ఇప్పటివరకు చేపట్టిన విచారణ గురించి కోర్టుకు ఎలాంటి సమాచారం సమర్పించలేదన్నారు. విచారణ అధికారికి, కోర్టుకు సరిపోయే విధంగా జామానత్‌లను సమర్పించేందుకు నిందితుడు సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న 1వ అదనపు జిల్లా కోర్టు జడ్జీ రమాకాంత్ తీర్పును రిజర్వు చేస్తూ 14కు వాయిదా వేశారు.

బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన

ఆటోడ్రైవర్‌కు 20 ఏండ్ల జైలుశిక్ష

మెహిదీపట్నం, నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 13 : బాలుడిని ఆటోలో ఎత్తుకెళ్లి అసహజ లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్షతోపాటు పదివేల రూపాయల జరిమానా విధిస్తూ 12వ అదనపు జిల్లా కోర్టు జడ్జి టి. అనిత గురువారం తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించి హుమాయూన్ నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం... లంగర్‌హౌస్ ప్రాంతంలో నివసించే మసూద్(43) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. 2018 ఏప్రిల్ 25న మెహిదీపట్నం ఫిల్టర్ బెడ్స్ ప్రాంతంలో నివసించే బాలుడిని ఆటోలో బలవంతంగా ఎత్తుకెళ్లి అసహజ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు హుమాయున్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. గురువారం ఫోక్సో కోర్టు స్పెషల్ సెషన్స్ 12వ కోర్టు జడ్జి అనిత నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసును రుజువు చేసిన సిబ్బందిని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ అభినందించారు. బాధిత బాలుడికి లక్ష రూపాయల నష్టరిహారం అందించాలని హైదారాబాద్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని తీర్పులో పేర్కొన్నారు.

రోడ్డుపై కారు దగ్ధం.. ప్రయాణికులు క్షేమం

మెహిదీపట్నం ఫిబ్రవరి 13 : లంగర్ హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి నడిరోడ్డుపై కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ ఇంజిన్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను ఆర్పినప్పటికీ కారు అప్పటికే పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అకట్టుకుంటున్న జానీమాస్‌లు

మదీనా సర్కిల్‌లో జానీమాస్‌లను పరిశీలిస్తున్న మత పెద్దలు ఇలియాస్ బుకారి తదితరులు

చార్మినార్, ఫిబ్రవరి 13 : రంజాన్ ఉపవాస వేళల్లో రోజుకు ఐదుసార్లు నమాజ్ చేయడానికి అనుకూలంగా ప్రత్యేక జానీమాస్‌లు అందుబాటులో ఉన్నాయని మదీనా క్యాప్ నిర్వహకులు ఇలియాస్ బుకారి తెలిపారు. మదీనా సర్కిల్ మహమ్మద్ క్యాప్ మార్ట్‌లో ఏర్పాటు చేసిన జానీమాస్ ఎగ్జిబిషన్‌ను ఆయన మత పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు జానీ మాస్‌లను వినియోగిస్తారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ రంజాన్ మాసమంతా ఉంటుందన్నారు. మత పెద్దలు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో ఈఈ లాల్‌సింగ్ పర్యటన

మెహిదీపట్నం, ఫిబ్రవరి 13 : అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లకు మార్గదర్శకాలు చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 12 ఈఈ లాల్‌సింగ్ అన్నారు. గురువా రం మల్లేపల్లి డివిజన్‌లోని నాంపల్లి ఏరియా ఆసుపత్రి సమీపంలో నిర్మిస్తున్న పీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈఈ లాల్‌సింగ్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం : వీహెచ్‌పీ

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 13: వాలెంటైన్స్ డేను దేశ రక్షణలో వీరమరణం పొందిన పుల్వామా అమరవీరుల సంస్మరణ దినంగా జరుపు కోవాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నేతలు పేర్కొన్నారు. గురువారం కోటిలోని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 14న అమరవీరుల సంస్మరణ దివస్ గోడపత్రికను విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భాగ్యనగర్(భాగ్యలక్ష్మి) విభాగ్ కార్యదర్శి కళ్లెం రాజేందర్ రెడ్డి, విభాగ్ సహ కార్యదర్శి గిరిధర్, భాగ్యనగర్ బజరంగ్‌దళ్ కన్వీనర్ అఖిల్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ .. విదేశీ ముష్కరుల చేతిలో వీరమరణం పొందిన జవాన్ల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువకులు, విద్యార్థులు భరతమాత సేవలో తరించాలని సూచించారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు మోహన్, రాఘవేందర్, సుధాకర్, రాజేందర్‌రెడ్డి, రామునాయుడు, రాహుల్, రాజేందర్, పవన్, అభిషేక్ పాల్గొన్నారు.

భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ సమావేశం

అబిడ్స్, ఫిబ్రవరి 13 : కోఠి హనుమత్‌గంజ్‌లో గురువారం భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ డాక్టర్ భగవంత్‌రావు, ప్రధాన కార్యదర్శి గోవింద్ నారాయణ్ రాఠి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో శ్రీరామ్‌జీ శోభాయాత్రను చేపట్టాలని నిర్ణయించారు. అదే రోజు స్వామి వారి కళ్యాణాన్ని సైతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యాత్రకు ముఖ్యఅతిథుల పేర్లను చర్చించి బాహేతీ భవన్‌లో కార్యాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు గోవింద్‌నారాయణ్ రాఠి తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు మెట్టు వైకుంఠం, మహేంద్ర వ్యాస్, బాబు గురు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రజలు పర్యవేక్షించాలి

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్,తదితరులు

కాచిగూడ,ఫిబ్రవరి 13: అభివృద్ధి పనులను స్థానికులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ అన్నారు. లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్యమందిర్ లైన్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సుభాశ్‌పటేల్, క్షీర్‌సాగర్, కృష్ణకుమార్, సంతోశ్, భీంరాజ్, రవియాదవ్,అరవింద్, హజరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

చార్మినార్, ఫిబ్రవరి 13 : ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు మలక్‌పేట్ ఏసీపీ శ్యాం సుందర్ తెలిపారు. దబీర్‌పుర పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. చంచల్‌గూడ ప్రభుత్వ కళాశాల ఏరియాకు చెందిన ఆసిఫ్ అలీ ఖాన్ శుభకార్యాల్లో వంట పనులు చేస్తుంటాడు. ఈనెల 3న రాత్రి 11 గంటలకు ఇంటికి చేరుకున్న ఆసిఫ్ అలీఖాన్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు నిద్రలేచి చూడగా బైక్ కనిపించకపోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆసిఫ్ అలీఖాన్ ద్విచక్రవాహనాన్ని సయ్యద్, మహమ్మద్ అలీమ్ అపహరించుకుపోయారు. నిందితులను సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు గురువారం వారిని అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు. ఇన్‌స్పెక్టర్ నానూనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కొట్టి గాయపర్చిన వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా

కాచిగూడ,ఫిబ్రవరి 13: ఓ వ్యక్తి తలపై బండరాయితో మోది గాయపర్చిన వ్యాపారికి నాంపల్లి 4వ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి సీవీఎస్ సాయిభూపతి ఐదేండ్ల జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించారు. కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు, ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకలోని తులసీరాంనగర్(లంక)కు చెందిన పంతికి నర్సింహులు(44) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. సూర్యాపేట ప్రాంతానికి చెందిన నరేశ్, ఓ మహిళ తిలక్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో సదరు మహిళతో పరిచయం పెంచుకున్నాడు. అంతేకాకుండా నరేశ్‌ను అంతమొందించాలని నిర్ణయించుకుని 2017 ఏప్రిల్‌లో నర్సింహులు తిలక్‌నగర్ చౌరస్తాలో అతడిని బండరాయితో మోదాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు నర్సింహులుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. గురువారం నాంపల్లిలోని 4వ అడిషనల్ సెషన్స్ కోర్టులో పీపీ కె.శ్రీవాణి హాజరుపరచగా న్యాయమూర్తి సీవీఎస్ సాయి భూపతి నిందితుడికి ఐదేండ్ల జైలుశిక్షతోపాటు రూ. 2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

పగిలిన పైప్‌లైన్.. రోడ్డుపై వృథాగా తాగునీరు

● కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బస్తీలకు అందని తాగునీరు

అంబర్‌పేట నీపీఎల్ రోడ్డులో తాగునీటి పైప్‌లైన్ పగలడంతో వృథాగా పోతున్న తాగునీరు

అంబర్‌పేట, ఫిబ్రవరి 13 : కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తాగునీరు వృథాగా పోతూ అనేక బస్తీలకు నీరు సరఫరా అందని పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుపై తాగునీరు పారుతూనే ఉన్నది. వేల లీటర్ల నీరు వృథాగా పోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా నుంచి నీపీఎల్ రోడ్డు ద్వారా అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వరకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పెద్ద సైజు వరద నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. నెలన్నర క్రితం ఈ పనులు మొదలయ్యాయి. రోడ్డును తవ్వి పైపులు వేస్తున్నారు. అయితే శ్రీ రమణ నుంచి నీపీఎల్ గేటు వరకు పనులు బాగానే సాగాయి. గేటు వద్ద గురువారం ఉదయం జేసీబీతో రోడ్డును తవ్వుతుండగా తాగునీటి పైప్‌లైన్ పూర్తిగా పగిలిపోయింది. అక్కడ పైప్ లైన్ ఉందని తెలిసినా జేసీబీతో ఇష్టానుసారం తవ్వడంతో పైప్ పగిలింది. దాంతో తాగునీరు ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుపై ప్రవహిస్తూనే ఉన్నది. దాంతో చాలా బస్తీలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తాగునీరు వస్తుందని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే ఎదురైంది. డే బై డే తాగునీరు వస్తుండడంతో రెండు రోజులపాటు తాగునీటి కోసం ఎక్కడికి పోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ పగిలినా మరమ్మతు చర్యలు చేపట్టలేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని వివిధ బస్తీల ప్రజలు కోరుతున్నారు.

'ప్రజలకు తాగునీటి కష్టాల్లేకుండా చూడండి'

మెహిదీపట్నం ఫిబ్రవరి 13 : రంజాన్ పండుగ సమీపిస్తున్నందున ప్రజలకు మంచినీటి కష్టాలు లేకుండా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొహినుద్దీన్ జలమండలి అధికారులను ఆదేశించారు. గురువారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో డివిజన్ల నాయకులు తాగునీటి సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వ్యక్తిపై దాడి.. దోపిడీ

● ఐదుగురు నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్

చార్మినార్, ఫిబ్రవరి 13: ఓ వ్యక్తిపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన ఘటనలో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు మలక్‌పేట్ ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు. గురువారం దబీర్‌పురా పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఏసీపీ కేసు వివరాలను వెల్లడించారు. మెదక్‌కు చెందిన మహమ్మద్ వహజాపుద్దీన్ కొంతకాలం క్రితం నగరానికి వచ్చి ఓలా బైక్ నడుపుతూ స్థానిక ఈద్ బజార్‌లో నివసిస్తున్నాడు. ఈనెల 8న రాత్రి 11గంటల సమయంలో విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తూ డబీర్‌పురాలోని ఏడుగుడుల దేవాలయ సమీపంలో నిలుచున్నాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మహమ్మద్ అబ్దుల్లా(22)మహమ్మద్ అలియాస్ కదర్ మోహినుద్దీన్(29), సొహైల్ ఖాన్(23),సయ్యద్ అమర్ (25), షరీఫ్ ఉస్మాన్ యామని(17), ఫరీద్, విశాల్ కలిసి వాహజవుద్దీన్‌ను ప్రశ్నించారు. ఏం చేస్తుంటావు? ఇక్కడ ఎందుకు నిలుచున్నావని గద్దిస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. అంతేకాకుండా అతడిపై దాడి చేసి డబ్బులు దోచుకున్నారు. అంతటితో ఆగకుండా అతడి వద్దనున్న ఏటీఎం కార్డును గుర్తించిన నిందితులు బలవంతంగా ఏటీఎం పిన్ నంబర్ తెలుసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు సమీపంలోని ఏటీఎం నుంచి రూ. 300 నగదు డ్రా చేసుకున్నారు. తిరిగి బాధితుడి వద్దకు వచ్చిన నిందితులు అంతా కలిసి మరింత డబ్బు కావాలని బెదిరించారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో మరోసారి అతడిపై దాడి చేసి సెల్‌ఫోన్ తీసుకొని సిమ్ కార్డు తొలగించి అక్కడి నుంచి పారిపోయారు.

దాడి ఘటన నుంచి తేరుకున్న బాధితుడు వెంటనే డబీర్‌పురా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహమ్మద్ అబ్దుల్లాను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.. నిందితుడు జరిగిన ఉదంతాన్ని పోలీసులకు వెల్లడ